

## కాఫీ విత్ కలెక్టర్

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ ) : ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచే ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. వారితో కాఫీ తాగి ముచ్చటించారు. ఇకపై హాజరుశాతం పెంచేలా కృషి చేసిన వారితో 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 13 ఆగస్టు 2024 | HYDERABAD





## బల్దియా బాగుంది

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు ఎంపికై బీహార్ రాష్ట్రానికి కేటాయించిన యువ ఐఏఎస్‌లు సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అధ్యయనం చేసేందుకు వచ్చిన ఈ బృందం.. బల్దియా పనితీరు బాగుందంటూ..కొనియాడింది. -సిటీబ్యూరో



## మెట్రో డీలక్స్‌లో లేడీస్‌కు నో ఫ్రీ

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో కొత్తగా వచ్చిన మెట్రో డీలక్స్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి లేదని, టికెట్ ధర చెల్లించాల్సిందేనని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్, సికింద్రాబాద్‌లో నూతనంగా 24 మెట్రో డీలక్స్ బస్సులను ఆర్టీసీ ప్రారంభించింది. అయితే ఈ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం లేకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఎందుకు తీసుకోవాలంటూ కండక్టర్లతో ఘర్షణ పడుతున్నారు. కేవలం ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అనుమతిచ్చి.. మెట్రో బస్సుల్లో నిరాకరించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో డీలక్స్‌ల్లో మహిళలకు ఉచిత ప్రయాణం లేదని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో మరో 110 కొత్త మెట్రో బస్సులు రాబోతున్నట్టు వెల్లడించారు.

## టీ హబ్‌లో మ్యాథ్ హ్యాక్

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ, మేషిన్ లర్నింగ్‌లో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా సోమవారం టీ హబ్‌లో మ్యాథ్ హ్యాక్ ప్రారంభమైంది. 36 గంటల పాటు కొనసాగే ఈ మ్యాథ్‌హ్యాక్‌లో ఆవిష్కరణలు చేయాలన్న ఔత్సాహికులైన విద్యార్థులు, స్టార్టప్స్, డెవలపర్స్‌తో కార్యక్రమాన్ని టీ హబ్ సీఈవో ఎం.ఎస్.రావు ప్రారంభించారు.

**ఒకప్పుడు** లేక్‌సిటీగా పేరొందిన భాగ్యనగర ఖ్యాతి.. 'కబ్జాల' కాలగర్భంలో కలిసిపోతున్నది. గడిచిన 44 ఏండ్లలో అనేక చెరువులు కనుమరుగైనట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎస్ఆర్ఎస్‌సీ) నివేదిక వెల్లడించింది. మహానగరంలో 60 శాతానికి పైగా తటాకాలు అన్యాక్రాంతమయ్యాయని తేల్చింది. కంటి ముందే కనుమరుగైపోతున్న జలవనరులను పరిరక్షించుకోకపోతే.. భవిష్యత్‌లో హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనున్నది.

ఎస్ఆర్ఎస్‌సీ నివేదిక



# చెరువు.. కబ్జా దరువు

### 60 శాతంపైగా చెరువులు అన్యాక్రాంతం



"నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎస్ఆర్ఎస్‌సీ) నివేదిక ప్రకారం 44 ఏండ్లలో చాలా చెరువులు కనుమరుగయ్యాయి. ఇందులో అనేక చెరువులు 60 శాతం, 80 శాతం, కొన్ని చోట్ల వందకు వంద శాతం కబ్జాలకు గురయ్యాయి. ఆక్రమణలు అడ్డుకోకపోతే హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది. ఎక్కువగా 60 శాతం పైగా చెరువులు కబ్జాకోరల్లో ఉన్నాయి. వాటిపై విడతల వారీగా చర్యలు తీసుకోబోతున్నాం. పేదవాళ్ల ముసుగులో కబ్జాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతాం. త్వరలోనే హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానున్నది".

-ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

### కబ్జా కోరల్లో చిక్కిన చెరువుల జాబితా ఇదే..

| చెరువు | తగ్గిన విస్తీర్ణం(శాతం) |
|---|---|
| తుమ్మలకుంట | 100శాతం |
| పెద్ద చెరువు | 96శాతం |
| మిర్యాలగూడ చెరువు | 90శాతం |
| నల్ల చెరువు | 90శాతం |
| కుంట్లూరు పెద్ద చెరువు | 90శాతం |
| కొంపల్లి లేక్ - 1 | 88శాతం |
| ఖాజాగూడ లేక్ | 88శాతం |
| యాప్రాల్ చెరువు | 86శాతం |
| గుర్రం చెరువు | 85శాతం |
| జిల్లెలగూడ లేక్ | 85శాతం |
| కొంపల్లి లేక్ | 84శాతం |
| రామాంతాపూర్ చెరువు 1 | 84శాతం |
| బండ్లగూడ లేక్ | 83శాతం |
| పల్లె చెరువు | 82శాతం |
| ఓల్డ్ అల్వాల్ చెరువు | 82శాతం |
| ఇంజాపూర్ చెరువు | 80శాతం |
| అల్వాల్ లేక్ | 78శాతం |
| తూంకుంట లేక్ | 77శాతం |
| మంత్రాల చెరువు | 76శాతం |
| దూలపల్లి లేక్ | 76శాతం |
| పిర్జాదీగూడ లేక్ | 73శాతం |
| బాతుల చెరువు | 72శాతం |
| రామకృష్ణాపురం చెరువు | 71శాతం |
| పెద్దచెరువు | 71శాతం |
| సల్కం చెరువు | 70శాతం |
| కొకూర్ లేక్ | 69శాతం |
| పెద్ద చెరువు | 69శాతం |
| సఫిల్‌గూడ లేక్ | 66శాతం |
| దమ్మాయిగూడ లేక్ | 64శాతం |
| గుండ్లపోచంపల్లి లేక్-1 | 64శాతం |
| కొకూర్ చెరువు | 64శాతం |
| కప్పల చెరువు | 64శాతం |
| పోతాయిపల్లి లేక్ | 61శాతం |
| సాయినగర్ చెరువు | 60శాతం |
| బోన్ చెరువు | 57శాతం |
| అన్నరాయన్ చెరువు | 56శాతం |
| సరూర్‌నగర్ చెరువు | 56శాతం |
| చెంగిచర్ల లేక్ | 53శాతం |
| రామాంతాపూర్ చెరువు | 51శాతం |
| ఓవైసీ లేక్ | 45శాతం |
| నాగారం లేక్ | 45శాతం |
| నాగోల్ లేక్ | 41శాతం |
| దమ్మాయిగూడ చెరువు | 35శాతం |
| రామ చెరువు | 33శాతం |
| మీరాలం చెరువు | 32శాతం |
| జల్‌పల్లి లేక్ | 31శాతం |
| గుండ్లపోచంపల్లి లేక్-2 | 30శాతం |

### 44 ఏండల్లో అనేక తటాకాలు కనుమరుగు

### ప్రశ్నార్థకంగా నగర భవిష్యత్

సిటీబ్యూరో: లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు లేకుండా పోతున్నాయి. యథేచ్ఛగా పెరుగుతున్న జనారణ్యంలో భావితరాలకు చెరువులంటే ఎలా ఉంటాయో తెలుసుకోలేని పరిస్థితులు వస్తున్నాయి. తాజాగా మహానగరంలో అన్యాక్రాంతమైన చెరువులపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎస్ఆర్ఎస్‌సీ) నివేదిక రూపొందించింది. ఈ జాబితాలో 44 ఏండ్లలో చాలా తటాకాలు కనుమరుగైనట్లు తేల్చింది. మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న చెరువుల వాస్తవ, ప్రస్తుతం ఉన్న విస్తీర్ణంతో కూడిన సమాచారాన్ని శాటిలైట్ డేటా ద్వారా సేకరించింది. మహానగరంలో 60 శాతానికి పైగా చెరువులు కబ్జాకు గురైనట్లు తేల్చింది.వీటిపై విడతల వారీగా చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైతం స్పష్టం చేశారు. జలవనరులను పరిరక్షించుకోకపోతే... భవిష్యత్‌లో హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనున్నది.

# ఎవరినీ వదిలిపెట్టం..

### మూడు దశల్లో హైడ్రా కార్యాచరణ

### త్వరలోనే హైడ్రాకు స్పెషల్ పోలీస్‌స్టేషన్

### అక్రమ నిర్మాణాలకు అనుమతి, ఓసీలు జారీ చేసిన అధికారులపై చర్యలు

### హెచ్చరించిన కమిషనర్ రంగనాథ్

'చెరువులు, నాలాలు, పార్కులు, ఖాళీ స్థలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే బాధ్యులపై చర్యలు తప్పవు. కబ్జాలో ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని హెచ్చరించారు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. ప్రభుత్వ ఆస్తుల రక్షణ, చెరువుల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా పనిచేస్తుందని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు భూ కబ్జాలో ప్రమేయం ఉన్న వారందరిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బుద్ధభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైడ్రా కార్యాచరణపై కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. మూడు దశల్లో కార్యాచరణ రూపొందించుకొని హైడ్రా పనిచేస్తుందని వివరించారు. తొలి విడతలో చెరువులు, నాలాలు, పార్కుల్లో కొత్తగా కబ్జాలకు ఆస్కారం లేకుండా ఫోకస్ పెడుతామని, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రత్యేక సిబ్బందితో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని, కాలనీల సహకారం తీసుకుంటామని చెప్పారు. స్థానిక ప్రజల్లో జీవన ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రెండో విడతలో అప్పటికే ఏర్పడిన భవన, వ్యాపార నిర్మాణాలపై దృష్టి సారిస్తామని, అక్రమ నిర్మాణాలను సమూలంగా కూల్చివేసి.. భవిష్యత్‌లో కబ్జా చేయాలంటే భయపడే పరిస్థితిని తీసుకొస్తామన్నారు. మూడో విడతలో చెరువుల పరిరక్షణలో భాగంగా బెంగళూరు తరహాలో చెరువులను సుందరీకరణ చేసి పునర్జీవం పోస్తామని తెలిపారు. గొలుసుకట్టు చెరువులన్నింటినీ పునరుద్ధరిస్తామని, వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. లోటస్‌పాండ్, గాజులరామారం, చందానగర్, నందగిరి హిల్స్, పాతనగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామన్నారు. చెరువులు, పార్కులు, ఖాళీ స్థలాలు, నాలా కబ్జాలపై హైడ్రాకు 40-50 దాకా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు, చెరువులు, పార్కు స్థలాలు, బఫర్ జోన్లలో భూ ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని చోట్ల భవన నిర్మాణం పూర్తి కాక ముందే ఓసీ సర్టిఫికెట్లను జారీ చేయడం, బఫర్ జోన్‌లో ఇరిగేషన్ ఎన్‌వోసీ లేకుండానే అనుమతులు ఇచ్చారని, బాధ్యులైన అధికారులపై చర్యలు ఉంటాయని చెప్పారు.

### త్వరలోనే ప్రత్యేక పోలీస్‌స్టేషన్

హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని, మూడు జోన్లుగా విభజించి.. ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ఏటా హైడ్రాకు రూ.200కోట్ల మేర నిధులు ఇవ్వనుందని, త్వరలోనే 3500 మంది సిబ్బందిని నియమించుకుంటామని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. డీఆర్‌ఎఫ్‌తో పాటు కబ్జాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలని, హైడ్రా కార్యాచరణలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అన్ని రకాల అనుమతులను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. కబ్జాలు లేని హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తుందన్నారు.



బల్దియా వద్ద నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

# డబుల్ లబ్ధిదారుల ధర్నా

### ప్రజావాణిలో పరిష్కరించాలని బైఠాయింపు, సముదాయించిన మేయర్, కమిషనర్

### రెండు నెలల్లోగా మౌలిక వసతులు కల్పిస్తామని హామీ

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే అందజేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వందలాది మంది లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. నగర నలుమూలల నుంచి వచ్చిన వీరంతా తొలుత ప్రజావాణి కార్యక్రమంలోకి వెళ్లారు. చాలా మంది బయట గార్డెన్‌లో బైఠాయించి డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించాలనే నినాదాలతో హోరెత్తించారు. కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 66వేలకు పైగా లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటినా.. ఆ ఇండ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు. లిఫ్టులు పనిచేయడం లేదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చివరకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి లబ్ధిదారులతో మాట్లాడారు. జలమండలికి ఇప్పటికే రూ. 200కోట్ల మేర నిధులు ఇవ్వాల్సి ఉన్నదని, రాబోయే రెండు నెలల్లోగా డబుల్ ఇండ్లలో మౌలిక వసతులు కల్పిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

### రూ.100కోట్ల నిధులు ఏమయ్యాయి?

కేసీఆర్ ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల పథకంలో 66 లొకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేసింది. ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు హెచ్ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్ఎంసీకి బదలాయించింది. కానీ నేటికీ ఆ నిధులు ఖజానా నుంచి నిర్వహణకు మళ్లలేదు. పైగా డ్రైనేజీ, నల్లా కనెక్షన్ వేసిన జలమండలికి నిధులు మంజూరు చేయలేదు. డబుల్ బెడ్రూం ఇండ్లకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. అయితే రూ. 200కోట్ల నిధులను ఎలా సమకూర్చుకుని మౌలిక వసతులు ఎలా కల్పిస్తారన్నది స్పష్టత లేదు.

### ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ఆమ్రపాలితో కలిసి ఆమె ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. బల్దియాలో జరిగిన ప్రజావాణిలో 57 దరఖాస్తులు రాగా, ఆరు జోన్లలో మొత్తం 93 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, జీహెచ్ఎంసీ శానిటేషన్, ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం బల్దియాలో జరిగిన ప్రజావాణిలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి విన్నవించారు.

### పార్కును కాపాడండి

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆ స్థలాన్ని తిరిగి కాలనీ వాసులకు ఇప్పించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ ముదిరాజ్, యాదవరెడ్డి తదితరులు ప్రజావాణిలో అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్‌ను కలిసి విన్నవించారు.

### కలెక్టరేట్‌లో..

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి 239 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా 156 దరఖాస్తులు గృహ నిర్మాణ శాఖకు సంబంధించినవి కాగా, పింఛన్లు 18, భూ సమస్యలు 14 దరఖాస్తులు వచ్చాయి.

# తరలింపు తండ్లాట

### 'పైగా'కు హెచ్ఎండీఏ తరలింపు ప్రక్రియ ఆలస్యం


### ఆగస్టు మొదటి వారంలోనే పూర్తి కావాల్సిన పనులు

### ఇంకా కొనసాగుతున్న వైనం

సిటీబ్యూరో, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ తరలింపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆగస్టు మొదటి వారంలోనే నగరంలో పలు చోట్ల ఉన్న హెచ్ఎండీఏ విభాగాలన్నింటినీ ఒకే చోటకు తరలించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కానీ నెమ్మదిగా సాగుతున్న పనుల కారణంగా మరింత జాప్యం జరగనున్నది. ఆరు నెలల కిందటే ఆదేశాలు జారీ చేసినా... ఇప్పటికీ పనులు సాగుతూనే ఉన్నాయి. దీంతో హెచ్ఎండీఏ కార్యాలయాల తరలింపునకు మరికొంత సమయం పట్టేలా ఉన్నదని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందిన బేగంపేటలోని పైగా ప్యాలెస్‌కు హెచ్ఎండీఏ విభాగాలన్నీ తరలించాలని మార్చి 12న ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ప్రత్యేక జీవో జారీ చేశారు. అమీర్‌పేటలో హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం, నానక్‌రాంగూడలో ఓఆర్ఆర్, గ్రోత్ కారిడార్ ఆఫీస్, ట్యాంక్ బండ్ సమీపంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయాలు ఉండగా, వీటన్నింటినీ ఒకే వేదిక మీదకు తీసురావడం ద్వారా పాలనాపరమైన నిర్వహణ మరింత సులభతరం అవుతుందని దానకిశోర్ ఆదేశించారు.కార్యాలయాన్ని ఒకే చోట ఉండాలనే సర్కారు నిర్ణయంతో ఆదేశాలు జారీ చేసినా.. ఇప్పటికీ తరలింపు ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఆదేశించిన వారంలోపే ఇంజినీరింగ్ విభాగం పైగా ప్యాలెస్‌లో ఉన్న మౌలిక వసతులపై అధ్యయనం చేసిన అనంతరం పనులు మొదలుపెట్టారు. కానీ ఇప్పటికీ కొనసాగుతున్న నిర్మాణ పనులతో తరలింపు ప్రక్రియ ఎప్పుడనేది ఇంకా స్పష్టత లేదు.

### లక్ష చదరపు అడుగుల్లో..

ఏడు జిల్లాలో విస్తరించి ఉన్న హెచ్ఎండీఏ విభాగాలన్నింటినీ ఒకే చోట నుంచి విధులు నిర్వర్తించేందుకు పైగా ప్యాలెస్‌లో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ఆఫీస్ స్పేస్‌కు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.






# నో డిస్కౌంట్..!

### వాహనం కొంటే పూర్తి పన్ను కట్టాల్సిందే

### షోరూంలు ఇచ్చే డిస్కౌంట్‌కు మినహాయింపు లేదంటున్న ఆర్టీఏ

**వాహన కొనుగోలులో షోరూంలు ఇచ్చిన డిస్కౌంట్‌కు కూడా పన్ను చెల్లించాల్సిందే... పూర్తి ట్యాక్స్ కడితేనే.. ఆ వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. లేదంటే.. బ్రేక్ పడుతుంది. అదేంటీ మాకు షోరూం వాళ్లు డిస్కౌంట్ ఇచ్చారు కదా.. దాని మేరకే పన్ను చెల్లిస్తామంటే కుదరదంటున్నారు ఆర్టీఏ అధికారులు. షోరూం ధరపై పన్ను చెల్లించాల్సిందేనని, డిస్కౌంట్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదంటున్నారు.**

**-సిటీబ్యూరో, ఆగస్టు 12 ( నమస్తే తెలంగాణ)**


ఇటీవల మహేశ్ అనే వ్యక్తి రూ. 3.34 కోట్ల విలువ జేసే మెర్సిడెస్- బెంజ్ కంపెనీకి చెందిన ఓ కారును కొనుగోలు చేశాడు. ఆ కంపెనీ సదరు వ్యక్తికి రూ.30 లక్షలు డిస్కౌంట్ ప్రకటించింది. దీంతో అతడు రూ.3 కోట్ల నాలుగు లక్షలకు కారును కొనుగోలు చేశాడు. రూ. 30 లక్షలు డిస్కౌంట్ వచ్చిందని సంబురపడిన ఆ వ్యక్తి వెంటనే కారు కొనుగోలు చేసి.. ఆ మేరకు మాత్రమే పన్ను చెల్లించాడు. తీరా అతడు రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఓ కార్యాలయానికి వెళితే..మరో 30 లక్షలపై పన్ను చెల్లించాలని అధికారులు చెప్పారు. దీంతో అవాక్కవ్వడం కస్టమర్ వంతైంది. 'అదేంటీ? నేను కంపెనీ ఇచ్చిన ఇన్‌వాయిస్‌లో ఉన్న మొత్తానికి ట్యాక్స్ చెల్లించాను. కంపెనీ నాకు డిస్కౌంట్ ఇచ్చింది. ఆ డిస్కౌంట్‌కు నేనెలా పన్ను చెల్లిస్తాను?' అంటూ సదరు వ్యక్తి ఆర్టీఏ అధికారులకు మొరపెట్టుకున్నాడు. కానీ రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఏదైన వాహనం షోరూం ధర ఎంత ఉన్నా.. ఆ మేరకు పూర్తి పన్ను చెల్లించాల్సిందే. ఆ ధరలో డిస్కౌంట్ అనేది కేవలం కంపెనీ కస్టమర్‌కు ప్రకటించడమే. అంతేతప్ప.. పన్ను మినహాయింపునకు వర్తించదు'. అని అధికారులు స్పష్టం చేశారు. ఉదాహరణకు ఒక వాహనం ధర రూ.20 లక్షలు ఉంటే కంపెనీ డిస్కౌంట్ పేరుతో కస్టమర్‌కు 10 లక్షలకు ఇచ్చినా.. ఇన్‌వాయిస్ బిల్లు రూ. 10 లక్షలతో తీసుకొచ్చినా.. ఆ వాహన ధర ఆర్టీఏ డేటాబేస్‌లో ఉంటుంది. ఆ 20 లక్షలపైన 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ అనేది పన్ను మినహాయింపునకు కాదనేది.. కస్టమర్లు అవగాహన చేసుకోవాలని ఆర్టీఏ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

### వాహన పన్ను ఇలా..

| రిజిస్ట్రేషన్ | ధర | పన్ను |
|---|---|---|
| కొత్త వాహనం | 10-20లక్షలు | 17 శాతం |
| | 20 లక్షలపైన | 18 శాతం |
| 2 ఏండ్లలోపు వాహనం | 20లక్షలపైన | 17 శాతం |
| 2-3 ఏండ్లు | 20లక్షలపైన | 16.5 శాతం |
| 3-4 ఏండ్లు | 20లక్షలపైన | 16 శాతం |
| 12 ఏండ్లు మించితే | 20లక్షలపైన | 11.5శాతం |

### వాహనం ఏ ధరకు కొనుగోలు చేసినా...

**-రవీందర్ కుమార్, ఆర్టీఓ, నాగోల్.**



రవాణా శాఖ నిబంధనల ప్రకారం వాహనం ఏ ధరకు కొనుగోలు చేసినా..పూర్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ ఎంత ఇచ్చినా.. పన్ను విషయంలో మినహాయింపు కుదరదు. వాహనదారులు దీనిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. కొందరికీ ఈ విషయం తెలియక రిజిస్ట్రేషన్ సమయంలో అయోమయానికి గురవుతుంటారు. వారికి మేము నిబంధనలు తెలియజేసి పన్ను చెల్లించాలని కోరుతున్నాం.